క్లుప్తంగా

వలంటీర్లను ఆదుకోవాలంటూ నిరసన

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం సెంటర్‌లో వలంటీర్లను ఆదుకోవాలని శనివారం వలంటీర్ల జిల్లా కన్వీనర్ ఎం.సతీష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ నెల 26 నుంచి అక్టోబర్ 2 వరకు గాంధేయ మార్గంతో శాంతియుత పద్ధతిలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వలంటీర్లకు గత 4 మాసాల నుంచి కూటమి ప్రభుత్వం ప్రకటించిన పది వేలు అటుంచి కనీసం గత ప్రభుత్వం ఇచ్చిన ఐదు వేల రూపాయలు బకాయి పెట్టిందన్నారు. ఆకలితో అలమటిస్తున్న వలంటీర్లకు ఒక్కొక్కరికి రూ.20 వేల వంతున ప్రభుత్వం వెంటనే వలంటీర్ల ఖాతాలో జమచేయాలని ఆయన కోరారు.

రేబిస్‌కు నివారణ తప్ప చికిత్స లేదు

మలికిపురం: రేబిస్ వ్యాధికి నివారణ తప్ప చికిత్స లేదని గుడిమెళ్లంక పశువైద్యాధికారి బి.శివకుమార్ పేర్కొన్నారు. రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గ్రామంలో పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూరు శాతం ప్రాణాంతక రేబిస్ గురించి సెప్టెంబర్ 28న దేశవ్యాప్తంగా రేబిస్ దినోత్సవంగా జరుపుకొంటారన్నారు. 99% శాతం కుక్క కాటు (పిచ్చి) కొన్ని సందర్భాల్లో ఆరోగ్యకర కుక్క కాటు వలన, పిల్లి, నక్క, తోడేలు, ముంగిస, ఎలుక, కోతి మొదలైనవి కరవడం లేదా రేబిస్ వ్యాధిగ్రస్త జంతువు లాలాజలం మనుషుల గాయాల మీద పడినా కూడా వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. అలాగే ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు కూడా రావచ్చని కరిచిన వెంటనే ధారాళంగా నీళ్లు వచ్చే కుళాయి కింద పది నిమిషాలు కడగాలి. తర్వాత, సబ్బుతో పలుమార్లు కడగి ఆ తర్వాత పొవిడోన్, బెటాడిన్, సేవ్లాన్, డీపోల్ వంటి యాంటీసెప్టిక్ లోషన్ పూయాలి. ఆ తర్వాత సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి యాంటీ రాబిస్ టీకాలు, టీటీ, క్రమం తప్పకుండా వేయించుకోవాలని సూచించారు.

పోరాట యోధుడు భగత్‌సింగ్



నగరంలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల నివాళి

మామిడికుదురు: ఆంగ్లేయుల గుండెల్లో భయాన్ని రేకెత్తించిన పోరాట యోధుడు భగత్ సింగ్ అని నగరం ముస్లిం వీధి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని జకీరున్నీసా బేగం కీర్తించారు. భగత్ సింగ్ జయంతిని శనివారం నగరం స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన త్యాగాలు, పోరాటాలను వివరించారు. ఎంతో మందికి భగత్‌సింగ్ ఆదర్శంగా నిలిచారన్నారు. పాఠశాల విద్యార్థులు భగత్‌సింగ్ జీవితంలోని ప్రధాన ఘట్టాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మాగాపు విజయదుర్గారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో దోమలు విపరీతంగా పెరిగి వ్యాధులు అధికంగా ప్రబలుతున్న నేపథ్యంలో మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ కోట బేబీరాణి అన్నారు. చిరతపూడిలో రహదారుల వెంబడి పేరుకుపోయిన తుప్పలను ఉపాధి హామీ పథకంలో శనివారం తొలగిస్తున్నారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను సర్పంచ్ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ దోమలు నిల్వ ఉండకుండా ఇంటి పరిసర ప్రాంతాల్లో తుప్పలు, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు. సర్పంచ్ వెంట కార్యదర్శి వెంకట్ ఉన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మామిడికుదురు: నేషనల్ స్కూల్ గేమ్స్‌లో భాగంగా రాజోలు నియోజకవర్గం తరపున జరిగిన సెలక్షన్స్‌లో వివిధ ఆటల్లో పాల్గొనేందుకు మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారని మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ ఎం.శ్రీధర్ శనివారం తెలిపారు. అండర్–17 వాలీబాల్ పోటీల్లో బోయి రామదాస్, టి.రాకేష్‌కుమార్, ఎస్.సత్యమనోజ్, కె.రామసంతోష్, సీహెచ్ అవినాష్, ఖోఖో పోటీలకు వై.జశ్వంత్, ఎ.దినకర్‌పవన్‌శ్రీసాయి, జి.వెంకటేశ్వరరావు, కబడ్డీ పోటీలకు కె.ముకేష్, కేఎస్‌వీ మణికంఠ, అండర్–14 కబడ్డీ పోటీలకు పి.యోగేశ్వర్, చెస్‌కు సాదే ఫినిహాల్ ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం నిరంజని, ఉపాధ్యాయులు డి.సత్యనారాయణ, స్టాఫ్ సెక్రటరీ రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందువులకు బాబు క్షమాపణ చెప్పాలి

- ఆలయాల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ల పూజలు
- లడ్డూను రాజకీయాలకు వాడుకుంటున్నారని ఎద్దేవా



మలికిపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, నాయకులు



పి.గన్నవరం శివారు పోతవరంలో వేంకటేశ్వరుని ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి, మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి



స్వామి వారికి లడ్డూలను తీసుకువెళుతున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: శ్రీవారి లడ్డూల్లో కల్తీ జరిగిందంటూ అవాస్తవ ఆరోపణలు చేసి వివాదం సృష్టించిన చంద్రబాబు నాయుడు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు హిందువులు అందరికీ క్షమాపణ చెప్పాలని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దర్శనం చేసుకుని అక్కడ నుంచి తిరుపతి నుంచి తీసుకువచ్చిన లడ్డూలను తలమీద పెట్టుకుని స్వామి వారి ఆలయం మాఢ వీధుల్లో ప్రదక్షిణ చేశారు. స్వామి వారి దర్శించుకుని అనంతరం స్థానిక వైఎస్సార్ సీపీ నేత పోచిరాజు బాబురావు స్వగృహం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తన 100 రోజుల పాలనలో చేసిన తప్పులు కప్పిపుచ్చుకునేందుకే శ్రీవారి లడ్డూలపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. మీరు సిట్ అంటే కూర్చుని స్టాండ్ అంటే నిల్చొనే సిట్‌తో విచారణ చేయించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. శ్రీవారి లడ్డూపై మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఈ లడ్డూ వివాదాన్ని సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు జరిపించాలన్నారు. గతంలో కేసీఆర్ కూడా చంద్రబాబు నాయుడ్ని డర్టియస్ట్ పొలిటీషియన్ అన్నారని గుర్తు చేశారు. ఇకపై దుష్ట రాజకీయాలు ఆపి ఉన్న హిందువులందరికీ క్షమాపణ చెప్పాలని కోరారు. అలాగే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లడ్డూ వివాదంలో ప్రాయశ్చిత్త దీక్షలు ఆపి అనవసర రాద్ధాంతం సృష్టించకూడదని సూచించారు. అవాస్తవ ఆరోపణలతో శ్రీవారి ప్రతిష్ఠను ప్రపంచ వ్యాప్తంగా దిగజార్చిన ఈ ప్రభుత్వానికి తిరుపతి వేంకటేశ్వర స్వామి, రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. దేవదేవునిపై అనవసరమైన వివాదాలు సృష్టించడం ఆపి ఎన్నికల మేనిఫెస్టోల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలి ప్రజల దృష్టిని మళ్లించడానికి సీఎం చంద్రబాబు కుటిల రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. వాడపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, జెడ్పీటీసీలు బోణం సాయిబాబా, కుడిపూడి శ్రీనివాసరావు, మండల కన్వీనర్లు తమ్మన శ్రీనివాస్, దొమ్మేటి అర్జునరావు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు, పాలా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: సీఎం చంద్రబాబునాయుడికి దేవుడు మంచి బుద్ధి ప్రసాదించాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ప్రార్థించారు. మలికిపురం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పార్టీ శ్రేణులతో కలసి ఆయన పూజలు చేశారు. తిరుమల ప్రసాదంలో కల్తీ జరిగిందని లేని పోని తప్పుడు ప్రచారం చేసి అపచారం తలపెట్టిన చంద్రబాబుకి దేవుడే తగిన విధంగా శిక్ష వేస్తారని ఆయన అన్నారు. తన పాలనలో ప్రజలను తప్పు దారి పట్టే విధంగా దేవుళ్లను కూడా వాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలో పాలన గాలికి వదిలేసి ప్రతిపక్షాలను విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజుల్లో ప్రజలకు ఏం చేశారో చెప్పాలని సూచించారు. తన విఫల పాలనపై ప్రజల దృష్టిని మళ్లించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మాజీరావు, కుసుమ చంద్రశేఖర్, చెల్లుబోయిన బుచ్చియ్య మాస్టారు, గుబ్బల రమేష్, కొప్పిశెట్టి సీతామహాలక్ష్మి, అడబాల జానకిరామ్, కారుపర్తి భాస్కరరావు, తాడి సహదేవ్, ఇనుమర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో 'విప్పర్తి' పూజలు

పి.గన్నవరం: శతాబ్దాల చరిత్ర కలిగిన తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూపై తన స్వార్థ రాజకీయాల కోసం దుష్ప్రచారం చేస్తున్న సీఎం చంద్రబాబుకి మంచి బుద్ధి ప్రసాదించాలని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు వేంకటేశ్వరస్వామిని వేడుకున్నారు. పి.గన్నవరం శివారు పోతవరంలో వేంచేసిన కళ్యాణ వేంటేశ్వర స్వామి ఆలయంలో విప్పర్తి ఆధ్వర్యంలో శనివారం పార్టీ శ్రేణులు పూజలు చేశారు. విప్పర్తి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని అబాసు పాలు చేయాలని చంద్రబాబు కుట్రలు చేస్తున్నారన్నారు. నిందమీద నింద వేసి అబద్ధాలను నిజమని నమ్మించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పీకే రావు మాట్లాడుతూ తిరుమల లడ్డూపై దుష్ప్రచారం తగదన్నారు. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీలు గన్నవరపు శ్రీనివాస్, బూడిద వరలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, కుడుపూడి విద్యాసాగర్, విత్తనాల ఇంద్రశేఖర్, పోతవరం వేంక రాష్ట్ర నాయకుడు దొమ్మేటి వెంకట శివరామన్, మట్టపర్తి పండు, సర్పంచ్‌లు వడలి కొండయ్య, కొంబత్తుల ఏసుబాబు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుమల లడ్డూకు అపవిత్రతను ఆపాదిస్తూ ప్రభుత్వం చేస్తున్న అపచారానికి నిరసనగా ఈ పూజలు నిర్వహించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు హిందుత్వాన్ని దుర్వినియోగం చేస్తున్న సీఎం చంద్రబాబుకి ఆ వేంకటేశ్వరుడే కనువిప్పు కలిగించాలని ప్రార్థించారు. తిరుమలలో లడ్డూ కల్తీ కాలేదని ఈఓ జే.శ్యామలరావు ప్రకటించినా టీడీపీ శ్రేణులు అదే రీతిన దుష్ప్రచారం చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. ఆయా గ్రామాల్లోని పలు చోట్ల తిరుమలను కూటమి నేతలు ఏ విధంగా రాజకీయాలకు భ్రష్టు పట్టిస్తున్నారనే విషయాన్ని ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సొసైటీలకు తక్షణమే ఎన్నికలు జరపాలి



మహాజన సభలో మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జి మురళీ సత్యనారాయణ

మలికిపురం: ప్రభుత్వం సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి చాలా సంవత్సరాలైందని, తక్షణమే ఎన్నికలు జరిపించి మంచి పాలకుల ద్వారా మరిన్ని మేలైన సౌకర్యాలు రైతులకు అందించాలని సొసైటీ సభ్యులు తీర్మానం చేశారు. మండలంలోని రామరాజు లంక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మహాజన సభ సొసైటీ భవనంలో సంఘ పర్సన్ ఇంచార్జ్ గుబ్బల మురళీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. సభలో ఈ మేరకు తీర్మానం చేశారు. పర్సన్ ఇన్‌చార్జి మాట్లాడుతూ అత్యున్నతమైన ప్రతిష్ఠ కలిగిన రామరాజు లంక సొసైటీ 1920లో స్థాపించబడి 720 మంది మెంబర్లతో రూ.ఆరు కోట్ల వ్యాపార లావాదేవీలతో నడుస్తూ రూ.51 లక్షల డిపాజిట్లు కలిగి ఉందన్నారు. సొసైటీ అంచెలంచెలుగా సభ్యులను పెంచుకుంటూ ఎస్‌టీఎల్‌టీ రుణాలను అందిస్తూ సొసైటీ ద్వారా రైతులకు కృషి రైతులకు చేస్తుందన్నారు. 2024–25 అంచనా బడ్జెట్ ప్రవేశపెట్టి జమా ఖర్చుల వివరాలను సీఈవో నారాయణ రావు తెలియజేశారు. సొసైటీ రైతు నేస్తం ద్వారా ఎకరానికి రూ.8 లక్షల వరకు రుణం పొందే సౌకర్యం సొసైటీలో భూములున్న రైతులకు ఉందని దానిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, సర్పంచ్ కాకర శ్రీనివాస్, ఉపసర్పంచ్ మేడిచర్ల గంగన్న, సొసైటీ మాజీ అధ్యక్షుడు చొప్పల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: సొసైటీల ద్వారా రైతుల తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం వల్ల సంఘం ఆర్థికంగా బలోపేతమై అభివృద్ధికి బాటలు వేస్తుందని సొసైటీ ఇన్‌చార్జి ఐ.శ్రీనివాస్ పేర్కొన్నారు. అంబాజీపేట సొసైటీలో సీఈవో కుంపట్ల అయ్యప్పనాయుడు అధ్యక్షతన 90వ మహాజనసభ శనివారం జరిగింది. శ్రీనివాస్ మాట్లాడుతూ సొసైటీలో రుణాలతో పాటు డిపాజిట్, నెలవారి పొదుపు ఖాతాలను నిర్వహిస్తున్నామని, లాకర్ సదుపాయం కూడా ఏర్పాటు చేశామన్నారు. రైతుల స్వప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సొసైటీల ద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ మాజీ చైర్‌పర్సన్ దొమ్మేటి సత్యమోహన్, మాజీ సభ్యులు నందెపు సూరిబాబు, గోసంగి గంగిశెట్టి, పితాని ఆనంద రావు, కొర్లపాటి చంటి, శీలం మోహనరావు, గుత్తుల పండు, ముత్యాల సత్తిబాబు, క్రాప నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని ఆలయ ఏసీ, ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టికెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,23,895, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.37,208తో మొత్తం రూ.1,61,103 ఆదాయం వచ్చినట్టు ఏసీ అండ్ ఈఓ తెలిపారు.

మాజీ సీఎం జగన్‌ను కలసిన సహదేవ్



మాజీ సీఎం జగన్‌ను మర్యాద పూర్వకంగా కలసిన సహదేవ్

సఖినేటిపల్లి: తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, మండలంలోని వీవీ మెరక గ్రామానికి చెందిన తాడి సహదేవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. సహదేవ్ ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ స్టూడెంట్ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు.

50 మంది రక్తదానం



మామిడికుదురులో రక్తదానం చేస్తున్న దీప్తి కళాశాల విద్యార్థి

మామిడికుదురు: స్థానిక ఓ ప్రైవేట్ స్కూల్‌లో శనివారం ఉచిత రక్తదాన శిబిరం జరిగింది. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. దీప్తి విద్యా సంస్థల అధినేత డీవీవీ సత్యనారాయణతో పాటు కళాశాలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు రక్తదానం చేశారు. అమలాపురం ఏరియా హాస్పటల్ బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ అన్నపూర్ణ, టెక్నికల్ స్టాఫ్ దొడ్డా కాశీ, రాజశేఖర్, రమణమూర్తి, కళాశాలకు చెందిన వెంకటేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం పనుల పరిశీలన



తాగునీటి పథకం పనులపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం గ్రామంలో జల్ జీవన్ మిషన్‌లో రూ.17.33 కోట్లు అంచనాతో నిర్మితమవుతున్న సమగ్ర రక్షిత తాగునీటి పథకం పనుల పురోగతిని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శనివారం పరిశీలించారు. అలాగే సమీపంలో నిర్మిస్తున్న ఓహెచ్‌బీఆర్ ట్యాంకు పనులను, శుద్ధి చేసిన నీటిని నిల్వ చేసే భారీ సంపు పనులను కూడా ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యేకు పనుల పురోగతిపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఏఈఎస్ రాజన్ వివరించారు. చెరువులో బెడ్‌కార్పెట్ పనులు 60 శాతం పూర్తి అయినట్టు, సంపు నిర్మాణం 70 శాతం అయినట్టు, పి.గన్నవరం ప్రధాన పంటకాలువ వద్ద ఇన్‌టేక్ వెల్ నిర్మాణం జరుగుతోందని రాజన్ తెలిపారు. నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే సూచించారు. వెంట ఎంపీపీ వి.మల్లిబాబు, సర్పంచ్ కె.జాన్‌బాబు, ఎంపీటీసీ బి.నాగరాజు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ జి.పెదకాపు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ శిరీష, జి.మహాలక్ష్మి ప్రసాద్ పాల్గొన్నారు.

బేతాళ స్వామి మహోత్సవాలకు శ్రీకారం



బేతాళ స్వామి ఆలయం వద్ద పందిరి రాటకు పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అంబాజీపేట: దశమి నవరాత్రులను పురస్కరించుకుని అంబాజీపేట శ్రీనివాసనగర్‌లో వేంచేసిన విజయ బేతాళ స్వామి వాహన మహోత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. స్థానిక ఆలయం వద్ద అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం పందిరి రాట ముహూర్తం చేశారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చే నెల 3న బేతాళ స్వామి వారి కలశ స్థాపన చేసేందుకు సంఘ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే వచ్చే నెల 16న బేతాళ వాహన మహోత్సవం, తీర్థం జరపనున్నట్లు సంఘ అధ్యక్షుడు డి.వెంకట రామారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్యఅర్జున మోహనరావు తెలిపారు.

పోషకాలతో సంపూర్ణ ఆరోగ్యం



పినపళ్లలో సీమంతాలు నిర్వహిస్తున్న ప్రజా ప్రతినిధులు, ఐసీడీఎస్ అధికారులు



సఖినేటిపల్లిలో నిర్వహించిన సీమంతాలు

కొత్తపేట: జాతీయ పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం వానపల్లిలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ కె.నాగమణి పర్యవేక్షణలో స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పల్లి భీమారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సూపర్‌వైజర్లు, నాగమణి, చంద్రకళ, స్థానిక పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, పండ్లలో పోషకాలు మెండుగా ఉంటాయన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన ఆహారం గురించి వివరిస్తూ ఐరన్, కాల్షియం, విటమిన్లు కలిగిన ఆహారం తీసుకోవాలని వాటి ద్వారా రక్తహీనత నివారించవచ్చని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, బాలలకు అన్నప్రాశన నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీమంతాలు

సఖినేటిపల్లి: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ వీరా మల్లిబాబు పాల్గొన్నారు. ఆయన చేతుల మీదుగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. పౌష్టికాహారం ఆవశ్యకత గురించి ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి వివరించారు. ఎంపీటీసీ కట్టా వెంకాయమ్మ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జిల్లెళ్ల రోజా, వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: సనాతన సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు గర్భిణుల సీమంతాలు ప్రతీకగా నిలుస్తాయని సర్పంచ్‌లు సంగిత సుభాష్, తోట భవాని అన్నారు. గర్భిణులు, బాలింతలు తరచూ పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఆలమూరు మండలంలోని పినపళ్ల, సంధిపూడి గ్రామాల్లో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా జరిగాయి. కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పి.శారద ఆదేశాల మేరకు ఆలమూరు సెక్టార్ సూపర్‌వైజర్ టీఎస్వీ నాగలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు జరిగాయి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. పినపళ్ల, సంధిపూడి గ్రామాల్లో ఆయా అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులకు సీమంతాలు జరిగాయి. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల సహకారంతో 27 మంది గర్భిణులకు పూలు, పండ్లు, నూతన వస్త్రాలు, గాజులు, మిఠాయిలు అందజేసి అక్షతలు వేసి ఆశీర్వదించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, ఎంపీటీసీలు పెదిరెడ్డి పట్టాభి, తోలేటి సంతోష, కూటమి నేతలు పాల్గొన్నారు.

జాషువా రచనల ద్వారా సమాజ చైతన్యం



కొత్తపేటలో జాషువాకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ పెద్దిరాజు తదితరులు

కొత్తపేట: ప్రముఖ సామాజిక కవి గుర్రం జాషువా తన రచనల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకువచ్చారని స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు అన్నారు. జాషువా జయంతిని కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ పెద్దిరాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి ప్రిన్సిపాల్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత, అన్ వాంటెడ్ యాప్స్ వల్ల జరిగే ప్రమాదాలను గురించి వివరిస్తూ వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్స్, మొబైల్స్ హ్యాకింగ్ చేయడం ద్వారా యువత పలు విధాలుగా నష్టపోతున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: సామాజిక ప్రయోజనం కోసం కవిత్వం రాసిన గొప్ప కవి గుర్రం జాషువా అని హెచ్ఎం కడలి సాయిరామ్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం ఆధ్వర్యంలో పద్మభూషన్ గుర్రం జాషువా జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత జాషువా చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ వెన్నపు సత్యనారాయణ, బొక్కా వెంకటేశ్వరరావు, వీఎస్‌వీ రమణారావు, నందెపు వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీలో తెలుగు అధ్యాపకుడు డాక్టర్ గరికపాటి హరిబాబు ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన గుర్రం జాషువా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రాచీన భాషల అధ్యయన కేంద్రం నెల్లూరులో రీసెర్చ్ అసోసియేట్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.గౌరీశ్వరరావు విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గుర్రం జాషువా నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల, ఆనాటి సామాజిక పరిస్థితుల అసమానతలను, రూపుమాపుటకు తన కవిత్వాలు, రచనల ద్వారా ప్రజలలో చైతన్యం తీసుకొచ్చిన మహాకవి అని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సత్యమూర్తి, సుభాషిని, సిద్ధార్థ, చినబాబు, రాజేంద్ర, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వకుంటే బతికేదెలా?



మాచవరం భవిత కేంద్రం వద్ద కంచాలతో నిరసన తెలుపుతున్న ఐఈఆర్టీలు

అంబాజీపేట: మూడు నెలుగా జీతాలు ఇవ్వకుంటే మా కుటుంబం బతకడం ఎలా అని భవిత కేంద్ర దివ్యాంగుల ఉపాధ్యాయులు, ఆయాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాచవరం భవిత కేంద్రం భోజన విరామ సమయంలో తమ వేతనాలు ఇప్పించాలని కోరుతూ ఖాళీ కంచాలను చేతపట్టి శనివారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మూడు నెలల జీతాలతో పాటు, సమ్మెకాలపు జీతం, మే నెలలో సర్వే అలవెన్సులు నేటికి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మూడు నెలల జీతాలతో పాటు బకాయిలను చెల్లించి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు ఎస్‌కే బేగం, ఎం.ఆశ, ఆయా బి.భారతి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారంగా నిర్వహించారు.

విద్యుత్ అధికారులపై చర్యలు చేపట్టాలి

మలికిపురం: సీఆర్‌జెడ్ పరిధిలో ఆక్వా సాగు చేయడం చట్ట విరుద్ధమని, అనుమతుల్లేని భూముల్లో సాగుపై తక్షణమే విచారణ చేసి బాధ్యులపై చర్యలు చేపట్టాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు చెవ్వాకుల వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఇరువురు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్జీటీ తీర్పు రీత్యా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అనుమతుల్లేని ఆక్వా సాగుకు విద్యుత్ కనెక్షన్ తొలగించడానికి వచ్చిన వివిధ అధికారులను అడ్డుకోవడం రైతులకు తగదన్నారు. ఆక్వాజోన్ పరిధిలో నిబంధనలకు అనుగుణంగా ఆక్వా సాగు చేసుకోవడానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని అన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

పి.గన్నవరం: మండలంలోని ముంజవరపుకొట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు సరెళ్ల కృపానందం, రాజ్‌కమల్ ఫౌండేషన్ (అమెరికా) సమకూర్చిన రూ.10 వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జి.రవికుమార్, ఎస్ఎంసీ చైర్మన్ కుంపట్ల కాశీ గంగాధర్, కె.గంగాభవాని, టి.శేషగిరిరావు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.